క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఫీడర్ మరమ్మతుల కారణంగా పోరంకి సెంటర్, ప్రభూనగర్, బందరు రోడ్డు, శ్రీనగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

పెనమలూరు: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన బాణావత్ అనుష్క, గోపి భార్యభర్తలు. వీరు పరదాలు అద్దెకు ఇచ్చే వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన షేక్.మీరావలి తరచుగా అనుష్క వెంట పడుతూ వేధించసాగారు. గతంలో పెద్దలు మీరావలిని మందలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అయితే మీరావలి ప్రవర్తనలో మార్పురాలేదు. రెండు రోజుల క్రితం అనుష్క ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో ఆమె ఇంటికి మీరావలి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో తాగునీటి పైప్‌లైన్‌కు సోమవారం మరమ్మతులు నిర్వహించారు. ప్రధాన గ్రామంలో పైప్‌లైన్, మంచినీటి కుళాయి మరమ్మతులకు గురి కావడంతో పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. దీనికి స్పందించిన అధికారులు సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెనమలూరు: విద్యార్థులు క్రీడల్లో పాల్గొని రాణించాలని పెనమలూరు పోలీస్‌స్టేషన్ కానూరు సెక్టార్ ఎస్ఐ రమేష్ అన్నారు. కానూరులో భాష్యం పాఠశాలలో జిల్లా స్థాయి ఆటల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించడంతో ఉన్నత శిఖరాలకు ఎదగ గలుగుతారని చెప్పారు. పాఠశాల ప్రతినిధులు జోసెఫ్‌జోషి, అరుణ, బ్యూలా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేపట్టారు. హరిబాబు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ కార్యకర్తలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎం.ప్రసన్నలక్ష్మి, వై.లత, సీఐటీయూ మండల అధ్యక్షుడు తాడంకి నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అనధికార కట్టడాల కూల్చివేత

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో అనధికార కట్టడాలను మున్సిపాలిటీ అధికారులు సోమవారం కూల్చివేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు గ్రామంలో కుప్పలు తెప్పలుగా అనధికార నిర్మాణాలు చేపట్టారు. వీటికి ఎటువంటి అనుమతులు లేవు. అనుమతులు లేని కట్టడాలు, లేఅవుట్లపై గతంలో 'సాక్షి' దినపత్రికలో కథనాలు రావటంతో అధికార యంత్రాంగం స్పందించింది. గ్రామంలో మసీదు వద్ద నాలుగు, [illegible]ంక రోడ్డులో ఒక నిర్మాణాన్ని కూల్చి వే[illegible].

టీడీపీ ఆ[illegible]పై దాడి కేసులో ఇద్దరు లొ[illegible]గుబాటు

గన్నవరం: టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ఇద్దరు ని[illegible]తులు సోమవారం పోలీసులు ఎదుట [illegible]గిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. [illegible]ండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై [illegible]గిన దాడి కేసులో 93 మంది వైఎస్సార్‌[illegible]పీ నేతలను నిందితులుగా చేర్చారు. [illegible] కేసులో ఇప్పటి వరకు 59 మందిని అరె[illegible] చేసి రిమాండ్‌కు పోలీసులు, సీఐడీ అధి[illegible]రులు తరలించారు. ఇదే కేసులో నిందితులై[illegible] గన్నవరం ఇస్లాంపేటకు చెందిన ఎస్‌కెఎం[illegible] కలాం, జానీలు స్వచ్ఛందంగా గన్నవరం [illegible]లీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. ఈ కేసు ద[illegible]ప్తు చేస్తున్న సీఐడీ అధికారులకు ఇద్దరిని గ[illegible]రం పోలీసులు అప్పగించారు. వీరిని మం[illegible]వారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యే[illegible]ోర్టులో సీఐడీ అధికారులు హాజరుపర్చను[illegible]ట్లు సమాచారం.

నేటి నుం[illegible] ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు

హనుమా[illegible]క్షన్‌రూరల్: బాపులపాడు మండలంలో [illegible]ంగళవారం నుంచి గ్రామాల వారీగా ప్ర[illegible]క ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎం[illegible]ఓ కె.జోగేశ్వరరావు సోమవారం ఓ ప్రకట[illegible] తెలిపారు. ఆధార్ నమోదు, సవరణలు[illegible]బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు క[illegible]ప్‌లో అందిస్తామన్నారు. 18వ తేదీన కొత్తపల్లి, అరుగొలను బండారుగూడెం గ్రామాల్లో, 19న తిప్పనగుంట, కొత్తపల్లి, అరుగొలనులో ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 28 వరకు పలు గ్రామాల్లో క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు.

జాతీయ డెంటల్ కన్వెన్షన్ విజేతలకు అభినందన

గన్నవరంరూరల్: దంత వైద్య విద్యార్థులు చదువులతో పాటు ఆటల పోటీల్లో రాణించటం, బహుముఖంగా ప్రతిభ చాటడం గొప్ప విషయమని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు అన్నారు. కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్, ఇంటర్న్ విద్యార్థులు ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు నిజామాబాద్‌లో జరిగిన 2వ నేషనల్ డెంటల్ కన్వెన్షన్‌లో పాల్గొన్నారు. దీనిలో సైంటిఫిక్-పేపర్ ప్రజెంటేషన్, మెరిట్ ఎగ్జామ్, స్పోర్ట్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ డబుల్స్, క్రికెట్ పోటీల్లో విశేషంగా ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విజేతలకు కళాశాలలో సోమవారం యాజమాన్యం అభినందన సభ నిర్వహించి, సత్కరించింది. ప్రిన్సిపాల్ రామోజీరావు, కన్వీనర్ పాలడుగు సాయి మాట్లాడుతూ.. జాతీయ డెంటల్ కన్వెన్షన్‌లో సత్తా చాటి కళాశాలకు పేరు తెచ్చారని కొనియాడారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏవో వై.మధుసూదనరావు, స్పోర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ అనుమోలు శ్రీహర్ష, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినకంచిలో చతుర్వేద పారాయణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి దేవస్థానం చినకంచిలో లోక కల్యాణార్థం తిరుమల తిరుపతి దేవస్థానాలు(టీటీడీ) ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న దినత్రయ సంపూర్ణ చతుర్వేద పారాయణం సోమవారం నిర్వహించారు. టీటీడీ సూపర్‌వైజర్ గుళ్లపల్లి చిన ఆంజనేయ ఘనాపాఠి, చినకంచి దేవస్థానం ట్రస్ట్ మొక్కపాటి శర్మ సంయుక్త ఆధ్వర్యంలో వేద పండితులు పారాయణం చేశారు.

డిపో మేనేజర్ మొండివైఖరి వీడాలి

ఉయ్యూరు: ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసాద్ మొండివైఖరి విడనాడి సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఎస్‌ఎంయూ జోనల్ అధ్యక్షుడు డీఎంఆర్ రాజు డిమాండ్ చేశారు. చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎంయూ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష సోమవారం నాలుగో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని రాజు సందర్శించి మాట్లాడారు. కేంద్ర కార్యాలయ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా జరిపిన చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎస్‌ఎంయూ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయబద్ధమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. డీఎం తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆవుల శ్రీనివాసరావు, టీఎం కృష్ణ, కేఎస్‌రావు, చంద్రమోహన్, ఎస్.సారథి, సీహెచ్ పిచ్చియ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్య సంరక్షణ

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కంకిపాడు ఆరోగ్య కేంద్రం ప్రాంగణాన్ని సోమవారం శుభ్రపరిచారు. ప్రాంగణంలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ మొక్కలు నాటారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ స్వచ్ఛతతో ఆరోగ్యవృద్ధి జరుగుతుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాల నిలిపివేతతో ఆర్థిక ఇబ్బందులు



కేసరపల్లిలో సమావేశమైన టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు

గన్నవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ విచారణ పేరుతో గ్రావెల్ తవ్వకాలు, రవాణా నిలిపివేయడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు వాపోయారు. ఈ మేరకు కేసరపల్లిలోని ఐటీ పార్కు పక్కన స్థలంలో గ్రావెల్, రబ్బీస్ రవాణా చేసే టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాడిశెట్టి ప్రసాద్, వేముల పిచ్చేశ్వరరావు, రాము, కుమార్ మాట్లాడుతూ.. గన్నవరం, కేసరపల్లి పరిసరా గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల టిప్పర్ లారీలు గ్రావెల్, రబ్బీస్ రవాణా చేస్తుంటాయన్నారు. ఎలక్షన్ కోడ్ కారణంగా రెండు నెలలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలు గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలిపివేశారని చెప్పారు. దీనివల్ల సుమారు ఐదు వేల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణా చేసే అవకాశాన్ని సదరు కాంట్రాక్టర్లు తమకు ఇవ్వడం లేదన్నారు. తమ సమస్యలను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే గ్రావెల్, రబ్బీస్ తవ్వకాలు, రవాణాకు అనుమతించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మరింత అప్పుల ఊబిలో చిక్కుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శొంఠి రవి, రాజులపాటి శివాజీ, చల్లా రవి, నెరుసు గణేష్, మల్లవల్లి శివ పాల్గొన్నారు.

గుడివాడ డీవైఈఓ(ఎఫ్ఏసీ)గా కొండా రవికుమార్

గన్నవరం: గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పూర్తిస్థాయి(ఎఫ్ఏసీ) బాధ్యతల్లో గన్నవరం ఎంఈఓ-1 కొండా రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు గుడివాడలోని డీవైఈఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఎంఈఓ-2 కమల, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్, మండల అధ్యక్షుడు ఎం.ఆనంద్, కృష్ణారావు, బషీర్, మేరీగ్రేస్, కుమారి, ధనియాల నాగరాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెనమలూరు: ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఎలుకల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్ 2కు చెందిన పఠాన్ మదార్‌బీ తన రెండో కుమారుడు పఠాన్ సలీంతో(30) కలిసి ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె, కాగా వారికి వివాహాలయ్యాయి. రెండో కుమారుడు పఠాన్ సలీం ఐదేళ్ల క్రితం భార్యతో విడిపోయి తల్లి వద్ద ఉంటున్నాడు. అతను పెయింటర్‌గా పని చేస్తాడు. ఈ నెల 13న సలీం ఇంట్లో తల్లి లేని సమయంలో ఎలుకల మందు తాగి ఈ విషయం ఫోన్‌లో సోదరుడు, సోదరికి తెలిపాడు. వారు వెంటనే వచ్చి సలీంను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. చికిత్స పొందుతున్న సలీం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

గన్నవరం: రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పొరపాట్లకు తావు లేకుండా ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.వెంకటశివయ్య సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓటర్లను చైతన్యపరిచేందుకు మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థి పేరు, ఫొటో పక్కన ఉన్న గడి మధ్యలో అంకెలు లేదా రోమన్ సంఖ్యలు వేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి.శివ కుమార్ అన్నారు. ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో సాయి క్రియేషన్స్ (గన్నవరం) ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్షలకు హాజరుకాబోయే టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కసారి క్రిమినల్ రికార్డుల్లో పేరు నమోదైతే జీవితాంతం దాని పర్యావసానం అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్, పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అమ్మ జాతర

కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. ఉయ్యూరు వీరమ్మ తల్లి

- కల్పవల్లిగా పూజలందుకుంటున్న శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి
- 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా తిరునాళ్ల నిర్వహణ
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు

ఉయ్యూరు: భక్తుల పాలిట కల్పవల్లిగా.. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా.. ప్రసిద్ధి గాంచిన శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం అంగరంగవైభవంగా జరుగుతోంది. ఏటా మాఘశుద్ధ ఏకాదశి(భీష్మ ఏకాదశి) రోజున ప్రారంభమై 15 రోజుల పాటు కనుల పండువగా జరిగే తిరునాళ్ల ఈ నెల 8వ తేదీన ప్రారంభమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుని, చీర, సారె, పసుపుకుంకుమలు సమర్పించి చల్లని తల్లికి పూజలు నిర్వహించి భక్తిపారవశ్యం చెందుతారు. బ్రిటిష్ కాలం నుంచే ఆచార సంప్రదాయం ప్రకారం అమ్మవారి తిరునాళ్లు కొనసాగుతుండటం ప్రత్యేక విశిష్టత.

అమ్మవారి చరిత్ర ఇదీ..!

13వ శతాబ్దంలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు తాలూకా పెద్ద కడియంలో బొడ్డు పరశురామయ్య, పార్వతమ్మలకు శివుని ప్రసాదంగా లేకలేక కలిగిన సంతానం వీరమ్మ తల్లిగా పిలువడే శివ వీరమ్మ. ఉయ్యూరుకు చెందిన పారుపూడి చలమయ్య, చెల్లమ్మలకు పెద్ద కుమారుడైన కనక చింతయ్యకు శివ వీరమ్మతో వివాహం జరిపించారు. అపురూపవతి అయిన శివవీరమ్మపై అప్పటి ఉయ్యూరు గ్రామ కరణం వేగరాజు సుబ్బయ్య కన్నుపడింది. తనను వశపర్చుకోవాలనే దురుద్దేశంతో చేసిన ప్రయత్నాలు అన్నీ విఫలమయ్యాయి. ఆఖరి ప్రయత్నంగా వేగరాజు సుబ్బయ్య తన బావమరిదితో కలిసి శివవీరమ్మ భర్త కనక చింతయ్యను హతమార్చే ఎత్తుగడ వేశాడు. గన్నవరం మండలం ముస్తాబాద సమీపంలో గొర్రెలను మేపేందుకు వెళ్లిన చింతయ్యపై విష ప్రయోగం చేసి హతమార్చారు. దీంతో కోపోద్రిక్తురాలైన శివ వీరమ్మ కరణం సుబ్బయ్యను శపించి సతీసహగమనం చేసింది. సతీసహగమనానికి అగ్నిగుండం తయారు చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. కరణం సుబ్బయ్యకు భయపడి అగ్నిగుండం ఏర్పాటుకు సహకరించలేదు. చివరికి దళిత కుటుంబానికి చెందిన ఓ కుటుంబం ముందుకు వచ్చి ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశంలో అగ్నిగుండ ప్రవేశానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం శివవీరమ్మ తన భర్తతో పాటుగా సతీసహగమనం చేశారు. ఈ క్రమంలో అగ్నిగుండ ప్రవేశానికి సహకరించిన దళిత కుటుంబానికి శివవీరమ్మ తనకు జరగబోయే 15 రోజులు తిరునాళ్ల మహోత్సవంలో 11వ రోజు ఆ దళిత కుటుంబం శిడి బండి వేడుక జరిపే వరాన్ని ప్రసాదించారని చరిత్ర చెబుతోంది. అగ్నిగుండ ప్రవేశం అనంతరం శివ వీరమ్మ శాపంతో సుబ్బయ్య మరణించటం, ఆయన కుటుంబం చిన్నాభిన్నం కావటంతో పాటు అమ్మవారి మహిమలు ఒక్కొక్కటి వెలుగుచూశాయి. విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న అప్పటి ఉయ్యూరు జమిందారు జిన్నాసాహెబ్ మార్గమధ్యంలో అమ్మవారి అగ్నిగుండం ప్రవేశం చేసిన ప్రాంతంలో బస చేశారు. జిన్నా సాహెబ్‌కు స్వప్నంలో అమ్మవారు కనిపించి తనకు ఆలయం నిర్మించాలని, ఉత్సవాలను నిర్విఘ్నంగా సాగేలా చూడాలని సూచించారు. అమ్మవారి ఆదేశం మేరకు జిన్నాసాహెబ్ ఆలయాన్ని నిర్మించి, తిరునాళ్ల నిర్వహణకు శాసనం చేయటం, ధూపదీప నైవేద్యాలకు భూములను కేటాయించారు. ఆమెను నమ్ముకుని పూజించిన కుటుంబాలకు మంచి చేస్తుండటంతో శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లిగా ఆవిర్భవించి ఆ నాటి నుంచి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. సంవత్సరం పొడవునా అమ్మవారి మెట్టినింటిలో కనక చింతయ్య సమేతంగా అమ్మవారు పూజలందుకుంటారు. తిరునాళ్లు 15 రోజుల పాటు మాత్రం ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకుంటారు.



శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి అమ్మవారు



విద్యుత్ వెలుగులో ఆలయ ప్రాంగణం

నేడు శిడిబండి వేడుక

వీరమ్మతల్లి తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు పాత వాటర్ ట్యాంకు రోడ్డులో ప్రత్యేకంగా శిడిబండిని సిద్ధం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది భక్తజనం పాల్గొంటారు.



కొనసాగుతున్న సంప్రదాయం..

మాఘశుద్ధ ఏకాదశి రోజున అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరి గ్రామోత్సవం అనంతరం ప్రధాన సెంటరులోని ఊయలస్తంభం వద్ద ఊయలలూగి ఆలయ ప్రవేశం చేస్తారు. పారుపూడి, నెరుసు వంశస్తుల పర్యవేక్షణలో తొలుత పోలీసు శాఖ చలువ కావిళ్లు, పసుపు కుంకుమ, చీర సారె సమర్పించి తొలి పూజ చేస్తారు. అనంతరం పల్లకిలో గ్రామోత్సవానికి బయలుదేరిన వీరమ్మతల్లికి అశేష భక్తజనం ఎదురుగండ, తిరుగుడు గండ దీపాలతో హారతులు పట్టి మొక్కుబడులు చెల్లిస్తారు. కరణం వేగరాజు సుబ్బయ్య కుటుంబం అంతరించిపోతుండటంతో ఆ వంశస్తులు అమ్మవారిని వేడుకోవటంతో పల్లకిలో బయలుదేరిన అమ్మవారు వేగరాజు వంశస్తుల ప్రాంతానికి వెళ్లి పసుపు కుంకుమలు తీసుకుని గ్రామోత్సవానికి బయలుదేరటం సంప్రదాయంగా వస్తోంది.

విశిష్టత.. ప్రత్యేకత

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వీరమ్మతల్లి అమ్మవారిని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రత్యేకించి సంతానం లేని వారు సంతాన ప్రాప్తి కోసం తిరునాళ్లకు వచ్చి పసుపు బట్టలతో ఆలయం వెనుక పానాచారం చేస్తారు. అమ్మవారు స్వప్నంలో వర ప్రసాదం ఇవ్వటంతో మరుసటి తిరునాళ్లకు వచ్చి మొక్కులు చెల్లించటం ఆనవాయితీ. జోడు పొట్టేళ్ల ప్రభబండ్లు అమ్మకు కానుకగా సమర్పించటం ప్రత్యేకత. పెద్ద ముఠా కార్మికులు తిరునాళ్ల ఆఖరి రోజు జోడు పొట్టేళ్ల పూల ప్రభ బండితో, మేళతాళాలతో అమ్మవారికి ఆఖరి పూజ చేసి మొక్కులు చెల్లించటం సంప్రదాయంగా వస్తోంది.



ఊయలలూగుతున్న అమ్మవారికి హారతులు పడుతున్న భక్తులు

ప్రధాన ఘట్టం.. శిడి బండి

తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక మంగళవారం జరగనుంది. సంప్రదాయం ప్రకారం పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు రోడ్డులో ప్రత్యేకంగా శిడిబండిని సిద్ధం చేస్తున్నారు. తిరునాళ్ల మహోత్సవంలో 11వ రోజు జరిగే ఈ ఘట్టానికి వేలాది మంది భక్తజనం హాజరుకానుండటంతో గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దళితవాడ నుంచి పెళ్లికుమారుడు మేళతాళాలతో ఊరేగింపుగా తరలివచ్చి శిడిబండికి ఏర్పాటుచేసిన శిడి బుట్టలో కూర్చుని వేడుక జరిపిస్తారు. శిడిబుట్టలో కూర్చున్న పెళ్లికుమారుడు శిడిబండితో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి ఆలయానికి ఎదురుగా శిడి బండిని ఉంచి మూడు సార్లు శిడి ఆడించటం, అనంతరం పెళ్లి కుమారుడు అమ్మవారి దర్శనంతో శిడి బండి వేడుక ముగుస్తుంది. 15 రోజుల తిరునాళ్ల అనంతరం పల్లకిలో ఊరేగింపుగా మెట్టినింటికి చేరుకోవడంతో ఉత్సవం ముగుస్తుంది.

భక్తజనంతో కిక్కిరిసిన పట్టణ పరిసరాలు..

వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం సోమవారం 10వ రోజుకు చేరింది. భక్తజనంతో పట్టణ పరిసరాలు కిక్కిరిశాయి. మహిళలు పాల పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. పొట్టేళ్లు, కోళ్లను మొక్కుబడులుగా చెల్లించారు. చలువ కావిళ్లతో అమ్మను దర్శించుకుని తరించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ జరిగింది.